కథానిక

# అసమర్థుడి పశ్చాత్తాపం

"మణి"

అతనికీ నాకూ పరిచయం కలగటంలోనే ఓ వినూత్నత్వం ఉంది. మామూలుగా ఇద్దరికి స్నేహం కుదిరిందీ అంటే వాళ్ళ అభిరుచులు పరస్పరం సానుభూతి కలిగిఉంటాయి. పైగా ఒకేచోట ఉండటమో, కలిసి చదవటమో ఏదో ఒకటి ఉండాలి. కాని మా యిద్దరికీ అల్లాంటి వేమీ లేవు. అయితే మే మిద్దరం సహాధ్యాయులం. వందామంది ఉండే క్లాసులో ఆ ఒక్కటి ఇద్దరిని ఆజన్మ స్నేహితులుగా చేసేందుకి చాలదు. పైగా మేము విభిన్న ప్రకృతుల వాళ్ళం కూడా! ఆ రోజు ఆనాటి సంఘటన అతనికీ నాకూ నేస్తం కలిసేందుకి దోహదం చేసింది. అది నా మనస్సులో అల్లాగే నభస్సులో ధృవ తారలా నిలచిపోయింది. మా మొదటి సంవత్సరం ఆరునెల్ల పరీక్షలు ప్రారంభం. బోర్డుమీద నెంబర్లు చూచి గదుల్లోకి వెళ్తున్నాము సీట్లు వెతుక్కుంటూ. అతను ముందేవచ్చి కూచొని ఉన్నాడు నా ప్రక్కనే. చూచి మరోవైపుకి తిరిగి ఏదో ఆలోచిస్తూ కూచున్నాను నేను... "నీకొక్కడుటయ్యా చెప్పేది" అన్న రిఛర్డు గొంతు వినిపించేసరికి ఉలిక్కిపడి పక్కకు చూచాను. రిఛర్డు సీటట అది. అందులోవచ్చి రవీంద్రుడు (అది అతని పేరు) కూచున్నాట్ట. అతనేమో లేచి వెళ్ళమంటాడు. ఇతను ఇది నీ సీటు కాదంటాడు. అందుకని రగడ. రిఛర్డు ద్వంద్వ యుద్ధంలోకి దిగినట్టుగా రెట్టించి మాటాడుతూన్నాడు. రవీంద్రుడు మాత్రం తన్ను కాదన్నట్టుగా జవాబిస్తున్నాడు. ఎంతసేపటికీ ఇది నీ సీటు కాదంటాడే కాని అక్కడనుంచి అంగుళం అవతలికి కదలడు... సూపర్వైజర్ వచ్చాడు. రిఛర్డు ఏదో చెప్పాడు. రవీంద్రుడు ఒక చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు. రిఛర్డును వెళ్ళి మరోమాటు నంబరు చూచి రమ్మని పంపాడు సూపర్వైజరు. ఏదో నస పెట్టుకుంటూ వెళ్ళి, వచ్చి ఇంకో సీటులో కూర్చున్నాడు.

"ఈ మాత్రానికా అంతగా తగవాడింది" అన్నాడు సూపర్వైజర్.

రిఛర్డు తల దించుకున్నాడు. మరి అంత కాక. పేపర్లిచ్చారు గంట కావటంతో.

రిఛర్డు దగ్గరకు వెళ్లి వీపుతట్టి "పొరపాటు పడ్డావు. ఏం ఫరవాలేదులే" అంటున్నాడు రవీంద్రుడు. ఏందీ సర్ రోజర్ తత్వం!

నాలో నేను నవ్వుకున్నాను.

రిఛర్డు తృప్తిగా కనిపించాడు. ముకుళించుకొనిపోయిన ముఖం వికసించింది. రవీంద్రుణ్ణోమాటు చూచాను.

ఇంతగా మనస్తత్వ మెరిగి నటించగలడా!

నేనైతే ఆ సమయంలో ఏం చేసేవాణ్ణి. చేతైనంతగా "టాంట్" చేసేవాణ్ణి. చచ్చినా ఓదారుస్తానా!

మళ్ళీ రవీంద్రుడివేపు చూచాను.

హృదయంలో ఏదో ఒక బాధ బయలుదేరింది. అతనితో మాటాడాలనీ, పరిచయం చేసికోవాలనీ ఉత్కంఠ జనించింది. "ఎల్లా రాశారు?" పూటపూట పరీక్ష కావటంతోనే వేసేవాణ్ణి ఈ ప్రశ్న.

కాలేజీ వదలటంతో గరల్స్ హైస్కూలు వైపు వెళ్ళేవాళ్ళం నేనూ సత్యం. మాకంటే ముందుగా రిఛర్డు ప్రభృతులు హాజరయ్యేవాళ్లు. అమ్మాయి లక్కడ ఆడుకుంటూంటే, మేము ఆ పిట్టగోడమీద బారులు తీర్చి కూర్చొని కొందరో జట్టునీ, మరి కొందరో జట్టునీ రెచ్చగొట్టేవాళ్ళం.

రోజూ సాయంకాలపు చర్య ఇది. నిరంతరాయంగా నిర్వికల్పంగా సాగిపొయ్యేది.

ఆ రోజు సత్యం రాలేదు. ఒక్కణ్ణే వెళ్తున్నాను. రవీంద్రు డెదురైనాడు "నమస్తే"తో "ఎక్కడికి వెళ్తున్నారు?"

"అల్లా షికారుకు. వస్తారా పోదాం?"

"సరే పదండి."

గమ్యస్థానం మారింది. దిగుల్తో కుంచించుకొని పోయాను. నేనతణ్ణి రమ్మనింది ఏదో మాటవరసకు మాత్రమే. కాని అతను తయారైనాడు. "ఎందుకు పిలిచానురా బాబూ" అని నేను నిందించుకోనక తప్పిందికాదు.

ఆ రోజు స్నేహితులకి దూరమైనాను.

"ఈ రోజైనా తప్పకుండా వెళ్ళాలి" అని మరునాడు ఆఖరుగంట పుస్తకాలు చంకన ఇరికించుకొని తిన్నగా లేచి ఇంటికి వచ్చి కాఫీ తాగి డ్రెస్ చేసికొని హుషారుగా ఈలవేస్తూ వాకిట్లో అడుగుపెట్టాను. మార్జాలంమాదిరి ఎదురైనాడు రవీంద్రుడు, ఆ రోజు కూడా.

ఎక్కడిదీ తద్దినం?

అతని వెంట పోయాను ఆ రోజూ కూడా. నిజానికి నాకా రోజు గుడ్ల నీరు తిరగలేదు గాని, ఏడుపు వచ్చింది. నేడు నిన్నటి మరునాడు. నిక్కవము. కాని ఉండబట్టలేక అన్నాను "ఈ రోజు కస్తూరిబాయి గరల్స్ స్కూలు వైపు వెళ్దామా?" అని. "అబ్బే ఎందుకండీ మన క్లాసు మూకంతా వస్తుందక్కడకు, ఆ పిల్లల్ని గోల పెట్టేందుకు" నా గుండె దడదడ లాడింది. అతనివైపు చూచాను సాభిప్రాయంగా. నన్ను వ్యంగ్యంగా ఉపాలంభించటం లేదు కదా?

"మీరంతగా పోదామంటే నాకేమీ అభ్యంతరం లేదు" అన్నాడు. పైగా ఇదొకటి. "అబ్బే, అక్కర్లేదు."

ఇక అంతే. రోజువెంట రోజు. ప్రతి రోజూ మేమిద్దరం వెళ్ళేవాళ్ళం. కాని ఒక్క రోజుకూడా ఆ వెనకటివేపు వెళ్లలేదు. ఆదిలో నాకు ఆరాటంగా ఉండేది. కాని క్రమేణా అలవాటయిపోయింది.

అతనూ నేనూ ఏమేమో మాటాడుకునే వాళ్ళం. ఏదో చర్చించుకునే వాళ్ళం. అప్పుడప్పుడు సత్యం కూడా మాతో వచ్చేవాడు. ధ్యేయమంటో, ఆదర్శమంటో వాగేవాణ్ణి నేను. మా సత్యం తనకంటే ధ్యేయివాది నభూతో నభవిష్యతి అనేవాడు.

ఆ రోజు విశ్వేశ్వర శాస్త్రి కట్నాల్ని గూర్చి మాటాడుతున్నారు "ఈ కాలపు విద్యార్థులున్నారే, ఎందుకూ పనికిమాలినవాళ్లు. రెండు వేలు చాలవు, మూడువేలు కావాలి" (అసలు రహస్యమేమిటంటే ఆయనకో కూతురుంది!) "అయితే ఇంకెందుకండి ఇంతలేసి డబ్బుపోసి చదవటం" అన్నారు ఎవరో. క్లాసంతా గొల్లుమంది. ఆయన అన్నారు "బాగా చెప్పావు కుండ పగలవేసినట్టు, ఉన్నది ఉన్నట్టు, దాపరికం ఏమీ లేకుండా" అని గంట అయిందాకా సాగించారు నవయువకులమీద దిగ్విజయం, శాస్త్రిగారు.

క్లాసులోనే ప్రారంభమైంది మా చర్చ. (ఆరోజు షికారుకు కూడా వెళ్ళలేదు.) నేనన్నాను "శాస్త్రిగారన్నట్టు చదవగానే సరా! నలుగురికీ ఆదర్శంగా బతకాలి. కట్నాలు ఇవ్వలేక అల్లాడుతూంటే ఏం వాళ్లను పీడించకుంటే? ఎల్లాగా నాలుగురాళ్ళు సంపాదించుకుంటారా, ఇక ఆకట్నానికి కక్కుర్తిపడకుంటే యేం?" అని. రవీంద్రుడన్నాడు "అందరూ అల్లా అనుకుంటారా? అత్తగారిచ్చే డబ్బెట్టి చదువుదామనుకోవచ్చు." "ఆ డబ్బెట్టి చదవకుంటే ఏంపోయింది?" అని సత్యం అందుకున్నాడు. ఇల్లా సాగింది ధోరణి. నేను "ఎవరూ కట్నం తీసికోకూడదు" అని ఉద్ఘోషించాను ఆనాటి నా ఉపన్యాసం వింటే తలకాయంటూ ఉంటే ఎవ్వడూ మళ్ళీ కట్నం ముట్టుకోడు అని నా ఘట్టినమ్మకం. (అది చాలా రోజులదాకా ఉండేది!) సత్యం తనకు వీల్లేదు కాని ఉంటే తనో బీదింటి పిల్లను కట్టుకొని ఆదర్శంగా బతికేవాడుట!

అయితే ఆశ్చర్యమేమంటే, రవీంద్రుడల్లాగే మొండిగా వాదించేవాడు "ఎందుకు చదవటం? మన హోదా బయట పడేదెలా?" అని నాకు కోపం వచ్చింది. ఉద్రేకంతో విమర్శించాను అతణ్ణి.

"అందరూ అనేవాళ్ళేగాని మానేవాళ్ళేరీ?" అన్నాడు నిదానంగా. అసలే అది మర్కటం, అందులో నిప్పుతొక్కింది, అన్నసామెతగా అప్పటికే నాకు కోపం హెచ్చిపోయింది. దాంతో పౌరుషం రెచ్చిపోయింది.

"ఏనాటికైనా నీ స్నేహితుల్లో ఒక్కడైనా అట్లాంటి వాడుంటాడని తెలుసుకోకపోవు" అన్నాను.

*　　　*　　　*

ఆరోజు భోంచేస్తూ నాన్నతో తాతయ్య అన్నాడు "ఒరే అబ్బాయ్, ఇంక నీ కొడుకు చదువుకు నేడబ్బు లేలేనురా" అని.

"పోనీలేవే, ఎక్కడన్నా నాలుగువేలొచ్చే సంబంధం ఒకటి చూడు" అన్నాడు నాన్న.

అంతకు ముందునుంచే సంబంధాలు వస్తున్నాయి. కట్నం ఏమంతరాదు అని మా తాతయ్య ఫూల్ప్రూఫ్ స్కీము వేసి చదువు పూర్తయిందాకా (కొంతవరకైనా) పెళ్ళి వాయిదా వేశాడు.

ఎవరో రాజమండ్రివాళ్లు వచ్చారు. వేలంపాట ఐదువేలు దాటింది. తాతయ్య తటపటాయించాడు. నాన్న అన్నాడు నాతో "ఒరేయ్ పిల్లను వెళ్ళి చూచిరాండిరా" అని.

నా హృదయంలో కల్లోలం రేగింది. చైత్రమాసపు సాయింతనపు టాకాశంలో దొంతరలు దొంతరలుగా దొరలిపోయే మేఘ శకటాల్లా గతఘటనలు స్మృతిపథంలోకి వచ్చాయి. కడుపులో చేయిపెట్టి కలచినట్లయింది. ఆనాడు రవీంద్రుడితో ఏమన్నాను? "ఏనాటికైనా నీ స్నేహితుల్లో ఒకడైనా అల్లాంటి వాడుంటాడని తెలుసుకో లేకపోవు."

"అవును, మేమిమ్మనలేదు. వాళ్ళిస్తామంటున్నారు. వాళ్ళ ఆనందంకొద్దీ వాళ్ళిస్తామంటే వద్దనటం ఏమి సమంజసంగా ఉంటుంది? వాద ప్రతివాదనలు రేగాయి. నన్ను నేను సమర్థించుకున్నాన.

"లోకంలో ఎందరిలా చేయటం లేదు? నీ తాతల్లాంటివాళ్లు కళ్లుమూసికొని చేసికున్నారు. ఇక నువ్వెంత, సముద్రంలో కాకిరెట్టవు."

"ఒకరితో పోటీ యెందుకు ఆనాటి ప్రగల్భాన్ని స్మృతికి తెచ్చుకో. నీ ధ్యేయవాదమేమైంది? ఇంతెందుకూ, రేపు నలుగురి మొఖమెల్లాచూస్తావు? కోతలరాయుడనరూ?"

సముద్ర మథనం సాగింది. ఫలితం మాత్రం అమృతం కాదు; గరళమూ కాదు. స్నేహితుల్లో చాలామందిని, ముఖ్యంగా రవీంద్రుణ్ణి పెళ్ళికి పిలవకపోవటమే.

ఓ వారం రోజుల తరవాత కాలేజీకి వచ్చాను.

రవీంద్రుడెదపడ్డాడు. "చాలా రోజులకు కనపడ్డారు" ఏదో నసిగాను. పెళ్ళికేమైనా వెళ్ళారా నాలాగానే? ఈ సెల్లో మా జోరుగా సాగాయి పెళ్ళిళ్ళు" వెతకబోయిన తీగ కాలికి తగిలింది. కాని ఆరోజునుంచీ నాలో ఓ నిరుత్సాహరేఖ ప్రవేశించింది. వెనకటిలా ధ్యేయమంటూ ఉత్సాహంగా మాట్లాడే వాణ్ణికాదు. ముఖ్యంగా వివాహం - కట్నాల ప్రస్తావనవస్తే ముభావంగా ఊరుకునేవాణ్ణి. వీలైతే రంగంలోంచి నిష్క్రమించేవాణ్ణి.

రోజులు దొరలిపోతోన్నాయి. గతం దూరపుకొండల్లా కనపడీ కనపడకుండా ఉంది. సామాన్యంగా ఆరోజుల్లో నేను గతాన్ని గూర్చి చింతించేవాణ్ణే కాదు.

పరీక్షలైనాయి. మూటా ముల్లె కట్టి మిత్రులంతా ఎవరి ఊళ్ళకు వాళ్లు వెళ్ళుతున్నారు. రవీంద్రుడు ఇచ్చి నా అడ్రసు దీసికొని అతని అడ్రసు యిచ్చి ఉత్తరాలు రాస్తుంటానని వాగ్దత్తం తీసికొని మరీ వెళ్లాడు.

నేనూ అమ్మమ్మా, ఓ నాలుగు రోజుల తరవాత మావూరు వెళ్ళాం. ఏమీ పని వుండేది గాదు చేసేందుకి. సాయంకాలపు చల్లగాలిలో అలా అస్తమయాకారం చూస్తూ కూచునేవాణ్ణి. ఏవేవో స్మృతులు వచ్చేయి. ఏదో బాధగా ఉండేది.

ఆరోజు, కాఫీ తాగి సావిట్లో కూచొని ఏదో మేగజైను తిప్పుతున్నాను. చేతిసంచీతో రవీంద్రుడు- అదే చిరునవ్వుతో- ఆ ముఖానికి అదొక కళ! వస్తోన్నాడు నమస్తే అంటూ.

"హలో రవీ. రారా."

సాయంకాలం అలా షికారుకు వెళ్ళాం. మామిడితోటల్లోంచి వచ్చే గాలి కమ్మగా వగరుగా వీస్తూ మత్తు కలిగిస్తోంది. వెళ్ళి చెరువు గట్టున కూచున్నాము. నిండా లేకున్నా, చాలా ఉన్నాయి నీళ్లు. అతను నీళ్లల్లో కాళ్లేసి ఈడుస్తున్నాడు. ఒడ్డులో వున్న బెచ్చికలు తీసి విసరుత్తున్నాను నేను. ఓ పదినిమిషాలు నిశ్శబ్దంగా గడచాయి.

అస్తమయ సూర్యకిరణాలు నీళ్ళల్లోపడి తళతళ మెరుస్తున్నాయి.

"ఏం రవీ, ఏం సంగతులు?"

"ఊఁ, సంగతులా... నేను పెళ్ళి చేసికోబోతున్నాను"

"సంతోషం. అయితే అందుకేనా ఇంత దూరం వచ్చింది?"

"కాదనుకో. వంగోలుకు వచ్చి — ఈ నాలుగడుగులు వేసి మీవూరు చూద్దామని వచ్చాను."

"సరే కాని కట్నమెంత?" నీచప్రకృతి నణచుకో లేకపోయాను

"కట్నమా?... అవును, వాళ్ళివ్వరు"

సవిమర్శకంగా చూచాను. సందేహానికేమీ తావివ్వలేదాతని ముఖచిత్రణ. ఇక తరచి అడగలేదు.

వివాహమంటపం బాగా అలంకరించిఉంది. వేదిక క్రిక్కిరిసి పోయింది బంధుమిత్రుల్తో... అర్జునుడివలె, నలకూబరుడివలె మెరసిపోతున్నాడు రవీంద్రుడు. కళ్ళ కాటుకతో, బుగ్గన చుక్కతో, నొసట కల్యాణ తిలకంతో, ఉషాసుందరిలా ఉంది వధువు. సూత్రధారణ ఐంది. విప్రాశీః ప్రవాహము అక్షతారూపంలో వధూవరుల్ని సుస్నాతుల్ని చేసింది. వరకట్నం అంటో వశిష్ఠులు కేక వేశారు. పెళ్లి పెద్దలేచి ఓ వెండితట్టతో వచ్చి యాజ్ఞికుడి చెవిలో "ఐదువేల నూటపదహారు" అన్నాడు.

వరకట్నం అంటో పురోహితుడు వేసిన కేకకి ఉలిక్కిపడ్డాను నేను. ఆనాడు చెరువు గట్టున కట్నమెంత అంటే యామన్నాడీ రవీంద్రుడు? వాళ్ళివ్వరని షేక్సిపియరు మొఖం వేసిన వాడేనా వీడు?..."

ముఖమ్మీది చెమటబిందువులు తుడుచుకుంటూ పైపంట క్రిందిపెదవి నొక్కి కడకంట రవీంద్రుణ్ణి చూచాను. అతనేదో గొణుగుతున్నాడు. శాస్త్రుల్లు చేతిలోని తట్ట క్రింద పెట్టి "అబ్బాయి కట్నం మఖ్ఖర్లేదంటున్నారండి" అన్నాడు.

సెకండుకు 7 మైళ్ళ వేగంతో చుట్టే భూమికప్పుడు నేనే ఇరుసును. పక్కనుండే మనుషులు వస్తువులు గిరగిరా తిరుగుతున్నాయి సూర్య మండలంలో గోళాలవలె.

కళ్లు నులుముకొని చుట్టూ కలయచూచాను. కల్లోలసాగరంలా ఉంది సభ. "మరి కొంచెంలా గేందుకి ఎత్తు" అన్నారు కొందరు. "మమ్మల్ని అగౌరవ పరచేందుకా, ఇప్పుడు తీరా, తెచ్చింతరవాత వద్దనటం." అన్నారు కొందరు సుబోధకులు. అన్నీ విని ఊరుకున్నాడు రవీంద్రుడు. ఒక్కదానికీ ప్రత్యుత్తరం చెప్పలేదు. బహుశా ఇవ్వదలచుకొని ఉండడు. ఆ విమర్శనా శకలాలు ఝంఝూమారుత తీవ్రాహతికి లేచిన తరంగాలుగా ఉవ్వెత్తుగా పైకి లేచి హిమవన్నగోన్నత శృంగాన్ని తగిలి భగ్నమైనట్లు చల్లారిపోతున్నాయి. తిరిగి కల్లోలిని ప్రశాంతమైంది.

సుఖమో, దుఃఖమో అప్పుడు నే ననుభవించింది, నాకు తెలీదు. బహుశా రెంటి సమ్మిళిత భావన అయివుండవచ్చు.

ఏకాంతంగా అతన్ని చూడాలనిపించింది. మొదటిసారి తాగి నిషా తీసిన తరవాత పశ్చాత్తాప తప్తుడైన వాడిలా బాధపడ్డాను.

వాకిలి ఓరగా వేసి ఉంది. నెట్టుతూ లోపలికి వెళ్ళాను. ఏదో తింటున్నాడు. ఇన్ని నాకిచ్చి తినమన్నాడు.

కదలకుండా నుంచున్నాను నేను.

చేయిపట్టి లాగి కూచోబెట్టి ఇక తిను అన్నాడు.

నాకు పెళ్ళయింది అని చెప్పటానికి నిశ్చయించుకొని వెళ్ళానక్కడకు. ఎల్లా చెప్పటమో తెలీలేదు. అసలెందుకు అక్కడకు వచ్చానో కూడా మరచి పోయ్యాను. ఏదో విద్యుత్తులా ప్రవహించే శక్తి నన్నావరించి వివశుణ్ణి చేసింది. నేనప్పుడు ఏమన్నానో, ఏం చేశానో నాకు తెలీదిప్పుడు. బహుశా "రవీ, నాకు పెళ్ళయింది" అని ఉంటాను. "నిన్ను నా పెళ్ళికి పిలవనందుకు క్షమించు" అనిఉండవచ్చు. లేదా "నేను కట్నం తీసుకున్నాను" అని చెప్పి ఉంటాను. కాని, నాకు గుర్తులేదు. అయితే, "ముందివి తిను; తరువాత మాట్లాడుకుందాం" అన్న అతని మాటలు మాత్రం నేను మరచిపోలేదు.